రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సెహరీ (మంగళవారం ఉదయం)
రాయచోటి	6.31	4.57
మదనపల్లె	6.32	5.01
రాజంపేట	6.29	5.03
పీలేరు	6.30	4.54

ఇచ్చిందే తీసుకో..!

వచ్చే వరకు వేచి ఉండు...

- అరకొర విద్యుత్ సామగ్రితో అస్తవ్యస్తం
- రైతులకు అవస్థలు..అధికారులకు తిప్పలు
- ఏడాదిగా ఇదే పరిస్థితి.. పూర్తి కాని వర్క్ ఆర్డర్లు
- జిల్లాలో 5 వేల మందికిపైగా రైతుల నిరీక్షణ



మదనపల్లె మండలం అడవిలోపల్లె వద్ద విద్యుత్తు స్తంభాలు నాటినా వైరు రాకపోవడంతో నిరుపయోగంగా...



రైతు ఇంటి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మదనపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో వ్యవసాయానికి అవసరమయ్యే కరెంటు సామగ్రి కొరత రైతులను వెంటాడుతోంది. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలకు ఆరు నెలలకు ముందు నుంచీ నేటి ప్రభుత్వంలోని ఏడు నెలలుగా అదే పరిస్థితి కొనసాగుతోంది. రైతుకు కొత్తగా విద్యుత్ సర్వీసు, ట్రాన్స్‌ఫార్మర్ లేదా అదనపు లైన్ మంజూరైతే దానికి సరిపడా మ్యాచింగ్ మెటీరియల్ పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచే స్టోరుకు రావడం లేదని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. నెట్ వస్తే బోల్టు దాదు..బోల్టు వస్తే నెట్ రాదు. ట్రాన్స్‌ఫార్మర్ వస్తే.. కండెక్టర్ ఉండదు. ఇలా ఒకటి వస్తే మరొకటి రాకపోవడంతో వచ్చేంత వరకు రైతు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పోనీ బయట మార్కెట్‌లో తెచ్చి పూర్తి చేద్దామనుకున్నా.. కొన్ని వస్తువులు దొరకవు. కొన్ని దొరికినా, మరికొన్ని విద్యుత్తు కాంట్రాక్టర్ సర్దుబాటు చేసినా రైతుపై అదనపు భారం పడుతోంది. అవసరాన్ని బట్టి కొందరు రైతులు వీటిని భరించినా..అధికారులకూ తిప్పలు తిప్పడం లేదు. ఎందుకంటే రైతు పేరున మంజూరైన అన్ని మెటీరియల్ స్టోర్ నుంచి డ్రా చేస్తే కానీ వర్క్ ఆర్డర్ క్లోజ్ కావడం లేదు. దీంతో అరకొరగా వచ్చిన సామగ్రితో అటు రైతులు, ఇటు అధికారులకు తిప్పలు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆయా మండలాలు, విద్యుత్ సెక్షన్లలో లైన్‌మన్ నుంచి ఏఈ వరకూ బదిలీ అయితే, అక్కడి పెండింగ్ పనుల నేపథ్యంలో అక్కడ జాయిన్ కావడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇది కూడా మరో పెద్ద సమస్యగా మారింది.

ఇది మదనపల్లెలోని ఒక సెక్షన్‌కో, మండలానికో లేక విద్యుత్తు డివిజన్‌కో పరిమితం కాలేదు. జిల్లాలోని అన్ని డివిజన్లలోనూ 5 వేల మందికిపైగా రైతులు వివిధ విద్యుత్ సామగ్రి కోసం ఎదురు చూస్తున్నట్లు చెబుతున్నారు. జిల్లాలో మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట విద్యుత్ డివిజన్లు ఉన్నాయి. వ్యవసాయానికి సంబంధించి రైతుకు విద్యుత్ పోల్స్ ట్రాన్స్‌ఫార్మర్, ఎక్స్ ఫ్యూజ్, ఎల్‌టీ ఫ్యూజ్ సెట్, కండెక్టర్, నెట్, బోల్టు, క్రాసారాలు, ఎర్త్‌పైపులు, ఫ్యూజు క్యారియర్లు, కేబుల్, తదితర మ్యాచింగ్ మెటీరియల్స్ ఉంటాయి. అయితే వీటిలో అన్నీ ఒకేసారి రావడం లేదు. వచ్చిందే తీసుకో..వచ్చేవరకూ వేచి ఉండు అనే పద్ధతిలో పనులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయి. కొందరు విద్యుత్ పోల్స్ నాటుకుని వైరు కోసం నిరీక్షిస్తుండగా, మరికొందరు దిమ్మె నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి మిగిలిన సామగ్రి కోసం ఎదురు చూస్తున్నారు. రైతుకు మంజూరైన అన్ని వస్తువులనూ స్టోర్ నుంచి ఏఈ డ్రా చేసి కాంట్రాక్టర్‌కు ఇస్తేనే క్షేత్రస్థాయిలో పని జరుగుతుంది. వీటిలో ఏది లేకున్నా పూర్తి చేయలేరు.

● నిమ్మనపల్లెకు చెందిన రైతు సి.రవీంద్రబాబుకు మూడు ఎకరాల భూమి ఉంది. దీనిని సాగులోకి తెచ్చేందుకు ఏడాది క్రితం బోరు తవ్వించారు. విద్యుత్తు సర్వీసుకు డబ్బులు చెల్లించారు. అయితే నెలరోజుల క్రితం నాలుగు విద్యుత్తు స్తంభాలు ఇచ్చారు. వాటిని పొలంలో నాటారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు, ఇతర పరికరాలేమీ ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి సరఫరా లేదని కరెంటోళ్లు చెబుతున్నారు. వచ్చిన వెంటనే ఇస్తామని చెబుతున్నారు. కానీ ఏడాది కాలంగా బోరు నిరుపయోగంగా ఉందని రైతు రవీంద్రబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిమ్మనపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ రాకపోవడంతో నిరుపయోగంగా బోరు

● మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీ నారకవారిపల్లెకు చెందిన రైతు ఎం.భాస్కర్‌రెడ్డి విద్యుత్తు సర్వీసు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇందులో భాగంగా 2023 డిసెంబరు 18వ తేదీ విద్యుత్తు సర్వీసు, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.1.11 లక్షలు డీడీ రూపంలో చెల్లించాడు. తన కున్న నాలుగెకరాల మామిడి తోటను సాగులోకి తెచ్చేందుకు కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఏడాదిన్నర అవుతున్నా ఇంతవరకూ ఏ పరికరమూ ఇవ్వలేదు. ప్రస్తుతం ఎండాకాలం మొదలు కావడంతో పూత, పిందెతో ఉన్న మామిడితోట ఎండుముఖం పడుతోంది. ఇంతకాలంలో సమీపంలోని రైతు బోరు నుంచి నీటిని వాడుకోగా, ప్రస్తుతం వారు ఆ భూమిని అమ్మేయడంతో సమస్య ఎదురవుతోంది. ఇప్పటికే పలుమార్లు కరెంటోళ్లను సంప్రదిస్తే ఇంకా స్టాకు రాలేదని చెబుతున్నారు. అక్కడ కార్యాలయంలో రైతుల జాబితా చూస్తే నా పేరు 76 సీరియల్‌లో ఉంది. 75 మందిని దాటి నా పేరు ఎప్పుడు వస్తుందో, అంతవరకూ మామిడి చెట్లను ఎలా కాపాడుకోవాలని మదనపడుతున్నాడు.



- నారకవారిపల్లెకు చెందిన రైతు ఎం.భాస్కర్‌రెడ్డి




మదనపల్లె మండలం నాయనవారిపల్లె వద్ద పొలంలో రైతులు లోకేశ్వర్‌రెడ్డి, బుడ్డన్న విద్యుత్తు స్తంభాలు నాటి, సిద్ధం చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్

● మదనపల్లె మండలం నాయనవారిపల్లెకు చెందిన రైతులు ఎం.లోకేశ్వర్‌రెడ్డి, బుడ్డన్నలు విద్యుత్తు సర్వీస్‌ల కోసం రెండేళ్ల క్రితం ప్రభుత్వానికి డబ్బు చెల్లించారు. అప్పటి నుంచి ట్రాన్స్‌ఫార్మర్, ఇతర సామగ్రి కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విద్యుత్తు స్తంభాలు ఇవ్వగా, ఇటీవల ఇద్దరు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చారు. విద్యుత్ స్తంభాలు పొలంలో నాటుకుని ట్రాన్స్‌ఫార్మర్ కోసం దిమ్మెలు కూడా వేర్వేరుగా ఏర్పాటు చేసుకున్నారు. కానీ కండెక్టర్ (వైరు), ఇతర మ్యాచింగ్ పరికరాలు ఇవ్వకపోవడంతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రెండేళ్లు పట్టిందని, మిగిలిన పరికరాలు ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు ఇస్తారోనని రైతులు నిట్టూరుస్తున్నారు. ఇప్పటికే టమోటా పంట సాగు చేయడానికి భూమి సిద్ధం చేసుకుని, విద్యుత్ సరఫరా కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే అడవిలోపల్లె వద్ద ఓ రైతు నాలుగు విద్యుత్తు స్తంభాలు నాటి, ఇతర పరికరాలు, కండెక్టర్ కోసం ఎదురు చూస్తున్నాడు.

● పెద్దమండ్యం మండలం తాటిమాకులపల్లెకు చెందిన రైతు సుధాకర్‌రెడ్డికి రెండెకరాల పొలం ఉంది. దీనిని సాగులోకి తెచ్చేందుకు ఏడాదిన్నర క్రితం అదనపు లోడ్‌కోసం ప్రభుత్వానికి డీడీ రూపంలో డబ్బు చెల్లించాడు. తర్వాత ఆరు నెలలకు ట్రాన్స్‌ఫార్మర్, రెండు విద్యుత్ స్తంభాలు ఇచ్చారు. కానీ వైర్లు, కాసారాలు, ఇతర పరికరాలు ఇవ్వలేదు. ఏమని అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని, వచ్చిన వెంటనే అమరుస్తామని విద్యుత్తుశాఖ అధికారులు చెబుతున్నట్లు రైతు చెప్పాడు. వచ్చిన స్తంభాలను పొలం వద్ద నాటుకోగా, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూడా ఏర్పాటు చేసుకున్నారు. కానీ ఇతర పరికరాల కోసం ఏడాది కాలంగా రైతు నిరీక్షిస్తున్నాడు. ఇప్పటికే వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇంట్లో పెట్టుకుని కాపాలా కాస్తున్నాడు.



తాటిమాకులపల్లె విద్యుత్ స్తంభంతో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె సిద్ధం చేసిన రైతు సుధాకర్‌రెడ్డి



భవనాల తొలగింపు యత్నంలో ఉద్రిక్తత



స్థానికులకు నచ్చచెబుతున్న తహసీల్దారు భీమేశ్వరరావు, ఎస్ఐ బాలకృష్ణ

పీలేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వోబీ కోసం అవసరమైన స్థలంలో ఉన్న భవనాలను తొలగించేందుకు అధికారులు పూనుకోవడంతో ఆదివారం పీలేరులో కాసేపు స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పీలేరు-మదనపల్లె మార్గంలో నిర్మితమవుతున్న ఆర్‌వోబీ కోసం రైల్వే క్రాసింగ్ వద్ద అదనపు స్థలం అవసరమైందని నిర్మాణ సంస్థ ఎన్‌హెచ్ అధికారులను కోరింది. గతంలోనే అదనపు స్థలానికి స్థల సేకరణ చేసి ఉన్న ఎన్‌హెచ్ఏఐ అధికారులు దానిని స్వాధీనం చేసుకుని నిర్మాణ సంస్థకు అప్పగించాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో కొంతకాలం క్రితం ఆయా స్థలాలు, భవనాలకు రెవెన్యూ అధికారులు మార్కింగ్ సైతం ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో నిర్మాణాలను తొలగించేందుకు రెవెన్యూ, ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులు ఆదివారం ఉదయం ఎక్స్‌కవేటర్‌లను అక్కడ మోహరించడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

అప్పటికప్పుడు చెబితే తాము ఎక్కడికి వెళ్లాలని, ఇళ్లు, దుకాణాలు ఖాళీ చేసే సమయం కూడా ఇవ్వకుండా నిర్మాణాలు కూల్చేస్తామంటే ఎలా అంటూ వారు అధికారులకు ఎదురుతిరిగారు. దీంతో అధికారులు, స్థానికుల మధ్య కాసేపు వాగ్వాదం జరిగి ఉద్రిక్తత ఏర్పడింది. ఎస్ఐ బాలకృష్ణ సూచన మేరకు భవనాలు ఖాళీ చేసేందుకు మూడు రోజుల గడువు ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు అంగీకరించడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు భీమేశ్వర రావు మాట్లాడుతూ ఎన్‌హెచ్ స్థలంలో ఉన్న వారికి మాత్రమే మార్కింగ్ ఇచ్చామని, వారు స్వచ్ఛందంగా ఖాళీ చేస్తే మంచిదని సూచించారు. అయితే భవనాల యజమానులు మాత్రం తాము స్థలానికి పరిహారం కోరడం లేదని, భవనాలకు పరిహారం చెల్లించాలని కోరుతున్నామని తహసీల్దారుకు తెలిపారు. అటువంటి సౌలభ్యం ఏమీ లేదని తహసీల్దారు తేల్చి చెప్పారు. బుధవారం సాయంత్రంలోపు ఖాళీ చేయాలని ఆయన స్పష్టం చేశారు.

పెద్దేరు ప్రాజెక్టు ఎడమ కాలువకు

నీరు విడుదల



ప్రాజెక్టు ఎడమ కాలువ నీటిలో పూలు చల్లి పూజలు చేస్తున్న జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కూటమి నాయకులతో కలిసి పెద్దేరు ప్రాజెక్టు ఎడమ కాలువకు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. నీటిలో పూలు చల్లి జలహారతి ఇచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పెద్దేరు ప్రాజెక్టు కాలువలను పూర్తిగా విస్మరించిందన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే ప్రాజెక్టు పరిధిలోని 4300 ఎకరాల ఆయకట్టుకు నీరందించాలన్న లక్ష్యంతో రూ.92 లక్షల నిధులతో కుడి, ఎడమ కాలువల మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆయకట్టు రైతులు నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు పొదుపుగా వాడుకుని పంటలు పండించుకోవాలన్నారు. పెద్దేరు ప్రాజెక్టుకు పూర్వ వైభవం తెప్పించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రాజెక్టు ఉద్యానవనం సుందరీకరణ, రోడ్డు, క్వార్టర్స్ మరమ్మతులు తదితర పనులకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ ఏఈ సతీష్‌రెడ్డికి తెలిపారు. పెద్దేరు ప్రాజెక్టు ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్దేరు ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 560 ఎంసీఎఫ్‌టీలు కాగా ప్రస్తుతం 350 ఎంసీఎఫ్‌టీల వరకు నీళ్లున్నాయి. కార్యక్రమంలో పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్, టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, వెంకట్రమణ, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీధర్‌నాయుడు, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, సోముశేఖర్, జగదీష్, బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ఉదయం అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసరు తాగి తడిబట్టలతో ఆలయంలో ఒరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

క్రీడలతో విద్యా వికాసం 7

● జేఎన్టీయూ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో..

చోరీలకు చెక్! 7

● దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే ఇట్టే పట్టేస్తుంది

వైసీపీలో కూటమి భయం

- జడ్పీటీసీలు క్యాంపునకు తరలింపు
- 30 మందే పయనం
- మూడురోజుల పాటు శిబిరంలోనే
- 26న సాయంత్రం కడప శిబిరానికి రాక
- 27న జడ్పీ చైర్మన్ ఎన్నికకు హాజరు



కడపరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీని కూటమి భయం పట్టుకుంది. మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ జమాకానాలోని జడ్పీ చైర్మన్ ఎన్నిక ఈ నెల 27న జరగనుంది. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమికి సునాయసంగా 7 నుంచి 10 మంది జడ్పీటీసీల బలం ఉన్నప్పటికీ టచ్ చేయలేదు. చైర్మన్ గిరి కావాలనుకొని కాస్త కష్టపడి ఉండింటే చైర్మన్ గిరి దక్కించుకొనే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. కానీ టీడీపీ కూటమి ఈ దిశగా దృష్టి సారించలేదు. అయితే వైసీపీ ఎందుకో ఏమో చైర్మన్ గిరి చేజారుతుందేమోనని కంగారుపడుతోంది. తమ 48 మంది జడ్పీటీసీలలో ఇప్పటికే ఆరు మంది ప్రత్యక్షంగా టీడీపీలోకి వెళ్లిపోయారు. వీరు కాక ఇంకా పలువురు జడ్పీటీసీలు టీడీపీకి టచ్‌లో ఉన్నట్లు చెప్పుకొస్తున్నారు. వెరసి ఈ నెల 27న జరగనున్న జడ్పీ చైర్మన్ ఎన్నిక వేళ తమ జడ్పీటీసీలు ఎక్కడ కొంపముంచుతారోనన్న భయం వైసీపీ పెద్దలను పట్టిపీడిస్తోంది. చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి జడ్పీటీసీలకు వైసీపీ బ్రెయిన్ వాష్ చేసే పనిలో నిమగ్నమైంది. అసంతృప్తిలో ఉన్న వారిపై ఫోకస్ పెట్టింది. వీరు చేజారకుండా ఉండేందుకు క్యాంపు తరలింపునకు పథక రచన చేశారు. కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని ఎంపీ అవినాష్‌రెడ్డి నివాసంలో మార్చి 21న విందు పేరుతో జడ్పీటీసీలను రప్పించి 23న క్యాంపునకు తరలి రావాలని ఆదేశించారు.

జడ్పీటీసీలు హైదరాబాద్ క్యాంపునకు తరలింపు

జడ్పీ చైర్మన్ ఎన్నిక వేళ వైసీపీ నేతలు తమ జడ్పీటీసీలను క్యాంపునకు తరలించారు. జిల్లాలోని ఆయా మండలాల జడ్పీటీసీలు ఆదివారం మధ్యాహ్నం కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని ఎంపీ అవినాష్‌రెడ్డి గృహానికి చేరుకున్నారు. అక్కడి నుంచి 3 గంటలకు రెండు బస్సులు, ఐదారు కార్లలో జడ్పీటీసీలు తరలివెళ్లారు. కానీ 30 మంది జడ్పీటీసీలు మాత్రమే క్యాంపునకు పయనమైనట్లు సమాచారం. అప్పటి వైసీపీ పాలనలో 2021లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో మొత్తం 50 స్థానాల్లో 49 స్థానాలను ఏకగ్రీవాల పేరుతో కైవశం చేసుకుంది. తరువాత పులివెందుల జడ్పీటీసీ సభ్యుడు మరణించారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో చైర్మన్, జడ్పీటీసీ పదవులకు రాజీనామా చేశారు. అలాగే మరో ఏడుగురు జడ్పీటీసీ సభ్యులు 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీలోకి వెళ్లారు. ఇలా క్రమేనా వైసీపీ బలం 40కి పడిపోయింది. ఈ నేపథ్యంలో మార్చి 27న జరుగుతున్న జడ్పీ చైర్మన్ ఎన్నిక వేళ వైసీపీ మిగిలిన జడ్పీటీసీలను ఆదివారం చేజారకుండా క్యాంపునకు తరలించింది. కానీ ఈ క్యాంపునకు 30 మంది జడ్పీటీసీలు మాత్రమే పయనమైనట్లు వినికిడి. దీంతో వైసీపీలో కాస్త కంగారు మొదలైంది. జడ్పీ చైర్మన్ ఎన్నికల్లో 50 శాతం సభ్యులు హాజరైతేనే ఎన్నిక ఉంటుంది. అంటే ప్రస్తుతం ఉన్న మొత్తం 48 మంది జడ్పీటీసీలలో 24 మంది తప్పక హాజరుకావాలి. ప్రస్తుతం వైసీపీ శిబిరంలో 30 మంది జడ్పీటీసీలు మాత్రమే ఉన్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. శిబిరంలో ఉన్నవారిలో ఆరేడు మంది జంప్ అయితే వైసీపీ ఎత్తుగడలు తలకిందులేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

జడ్పీటీసీల తరలింపుపై వైసీపీ నేతల నిఘా

ఉమ్మడి కడప జిల్లాలోని జడ్పీటీసీల తరలింపుపై నిఘా ఉంచారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, సుధ, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు తదితరులు ఎంపీ అవినాష్‌రెడ్డి ఇంటి నుంచి జడ్పీటీసీలను హైదరాబాద్‌లోని శిబిరానికి దగ్గరుండి పంపించి దారిలో వారు చేజారకుండా జడ్పీటీసీల వాహనాలను అనుచరుల ద్వారా ఐదారు కార్లలో అనుసరించినట్లు సమాచారం. వీరు ఆదివారం రాత్రి నుంచి సోమ, మంగళ, బుధవారం మధ్యాహ్నం వరకు క్యాంపులోనే ఉండి తరువాత అక్కడ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రికి కడపలో ఏర్పాటు చేసిన క్యాంపునకు, అక్కడి నుంచి గురువారం ఉదయం 10 గంటలకు జడ్పీకి చేరుకుంటారు. అక్కడ జరిగే ప్రత్యేక సమావేశం, చైర్మన్ ఎన్నికల్లో పాల్గొనేలా వైసీపీ జిల్లా నాయకత్వం చర్యలు చేపట్టింది.

మద్యం మత్తులో బండి నడిపితే.. కేసులే..!

● డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ చర్యలు కట్టుదిట్టం

పులివెందుల టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) :మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. పులివెందుల ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కేసులు పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే చోటు చేసుకుంటున్నట్లు పోలీసుల పరిశీలనలో తెలిసింది. ఈ నేపథ్యంలో పులివెందుల ట్రాఫిక్ పోలీసులు పార్నపల్లె రోడ్డు, ఆర్టీపీ బస్టాండు కూడలి, ముద్దనూరు రోడ్డు, ఉలిమెల్ల రోడ్డు, కడప రోడ్డు, పూలంగళ్ల సర్కిల్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బ్రీత్ అనలైజరు ద్వారా పరీక్షలు చేస్తూ వాహనదారులు ఎవరైనా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయితే తక్షణమే కేసులు నమోదు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, కారు, జీపులు, ఆటోలు, లారీ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నవారిలో ఉంటున్న వీరిలో లారీలు, ఆటో డ్రైవర్లే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం తాగి బైకులు నడుపుతూ పట్టుబడుతున్న వారిలో యువకులు ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందని పోలీసులు చెబుతున్నారు. దీంతో మత్తు దిగిన తరువాత యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామని చెబుతున్నారు.



డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చేతివాటం..?

తనిఖీల పేరుతో పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తున్నారని డ్రంకెన్ డ్రైవ్ పేరుతో అకారణంగా వేధిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్సు, సీ-బుక్ తీసుకుని, వాహనాలను స్టేషన్‌లో ఉంచుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు అంటున్నారు. అదే విధంగా డ్రంకెన్ డ్రైవ్‌లో తనిఖీల సమయంలో మందుబాబుల వద్ద పలువురు పోలీ సులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మందు తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే ఆ కేసుతో సరిపెట్టకుండా లైసెన్సు, సీ బుక్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి కూడా అడుగుతున్నారని, వాటిలో ఏమీ లేకున్నా భారీగా జరిమానాలు విధిస్తున్నా రని వాహనదారులు వాపోతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదంటూ ఇతర సాకులు చూపుతూ సెల్ ఫోటోలు తీసి ఈ-చలా నాలతో బెంబేలెత్తిస్తున్నారని ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. నిబంధనల మేరకే కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు అంటున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో.. చోరీలకు చెక్!

● దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే ఇట్టే పట్టేస్తుంది
● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
● 13 నెలల్లో 621 మంది వినియోగం



కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా కలిసి ఎక్కడికైనా వెళుతున్నారా.. మీ ఇంట్లో విలువైన సామాన్లు గట్రా ఉన్నాయా, ఎక్కడికైనా వెళ్లాలంటే భయపడుతున్నారా..? అయితే ఇప్పటి నుంచి ఆ భయాన్ని మానుకోండి. దొంగలను ఇట్టే పట్టించే యాప్ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంది. జిల్లాలోని ప్రజలు జిల్లా పోలీసు శాఖ అంది స్తున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్ హెచ్‌ఎంఎస్) యాప్‌ను సద్వినియోగం చేసుకోవ డం ద్వారా దొంగతనాలు అరికట్టేందుకు ఎల్‌హెచ్ ఎంఎస్ యాప్‌ను మొబైల్ ఫోనుతో అనుసంధా నం చేసుకుంటే ఇంటికి తాళం వేసి ఎక్కడి కైనా నిశ్చింతగా వెళ్లవచ్చు. మీ మొబైల్ ఫోను ద్వారా మీ ఇంట్లోని పరిస్థితిని సమీక్షించవచ్చు. పోలీసుస్టేషన్‌ల ద్వారా నిఘా ఉంచి దొంగలు ఇం ట్లోకి ప్రవే శిస్తే ఇట్టే పట్టేసే అవకాశం ఈ యాప్ వినియోగం ద్వా రా లభిస్తుంది. జనవరి నుంచి ఇప్పటి మార్చి వరకు జిల్లా వ్యాప్తంగా 621 మంది ఈ యాప్‌ను వినియోగి స్తున్నారు. ఎవరైనా ఊర్లకు వెళ్లేవారు ఈ యాప్‌ను వి నియోగించుకుంటే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చు. జిల్లాలోని కడప నగరంతో పాటు ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, జమ్మల మడుగు, ఎర్రగుంట్ల, బద్వేలు మున్సిపాలిటీలలో యాప్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఎస్పీ తెలిపారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ మొబైల్ కలిగిన వారు ముం దుగా ప్లేస్టోరులోకి వెళ్లి లాక్డ్‌హౌస్ మాని టరింగ్ సిస్టం అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలి. యాప్‌ను ఓపెన్ చేయగానే రిజిస్టరు, రిక్వెస్ట్ పోలీసు వాచ్ అనే రెండు ఆప్ష న్లు కనిపిస్తాయి. ముందుగా రిజిస్టరును ఎంచుకుని అక్కడ మీ పేరుతో పాటు, అడ్రస్, సెల్ నెంబరు ఎంటర్ చేయాలి. గెట్ మై లొకేషన్ ఆప్షన్ కూడా ఉంటుంది. దానిపై క్లిక్ చేసి ఇంటి లొకేషన్ గూగుల్ మ్యాప్ ద్వారా అందులో ఎంట్రీ చేయాలి. ఇదంతా ఇంటిలోనే కూర్చునే చేయవచ్చు. తద్వారా పోలీసులు మన ఇంటికి భద్రత ఇవ్వడానికి సులువైన మార్గం ఏర్పడుతుంది. ఆ తరువాత ఒక యూజర్ ఐడీ జనరేట్ అవుతుంది. దాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలి.

నిర్లక్ష్యమే చోరీలకు కారణం

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌పై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించకుండానే ఊర్లకు వెళుతుంటారు. వారు తిరిగి వచ్చేసరికి దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమే మంచిది.

ఇంటికి రక్షణ ..

లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా ప్రజల ఆస్తులను రక్షించవచ్చని చెప్పవచ్చు. ఊరెళ్లే ముందు సమాచారం అందిస్తే, పోలీసులు ఆ ఇంటిలో కెమెరాను అమర్చి, చోరీలకు ప్రయత్నించిన దొంగలను తక్షణమే పట్టుకునే అవకాశం లభిస్తుంది.

కెమెరాలే దొంగను పట్టిస్తాయి

అత్యవసర సమయాల్లో యాత్రలు, ఆసుపత్రులు, ఇతర ఊర్లకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వెంటనే పోలీసులు కాపలాగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ నుంచే ఇంట్లో ఏం జరుగుతుందో నిఘా పెడతారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సెల్‌ఫోను ద్వారా మన ఇంటిని మనం చూసుకోవచ్చు. ఒకవేళ దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే పోలీసులు అమర్చిన కెమెరాలు పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటరుకు క్షణాల్లో సమాచారాన్ని అందిస్తాయి. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి క్షణాల్లో దొంగలను పట్టుకునే వీలవుతుంది.

సద్వినియోగం చేసుకోండి

ప్రజలు ఈ యాప్ ద్వారా పోలీసు సేవలను ఉపయోగించుకుని విలువైన వస్తువులకు రక్షణ కల్పించుకోవాలి. ప్రజలందరూ సహకరిస్తే చోరీలను అరికట్టడమే కాక, దొంగల ఆటలను సులువుగా కట్టించవచ్చు. సంప్రదించాల్సిన ఎల్‌హెచ్‌ఎంఎస్ నెం.8186881100, ప్లేస్టోర్‌లో అయితే ఎల్‌హెచ్ ఎంఎస్, ఏపీ పోలీసు యాప్ అందుబాటులో ఉంటుంది.

-వెంకటేశ్వర్లు, సీఐ,
కమాండ్ అండ్ కంట్రోల్

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కడప స్పోర్ట్స్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. ఆదివారం స్థానిక పీవీఆర్ ఇండోర్ స్టేడియంలో న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ పని ఒత్తిడితో సతమతమయ్యే న్యాయశాఖ ఉద్యోగులకు క్రీడలు కాసింత మానసిక ఉపశమనాన్ని అందిస్తాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బాబాఫకృద్దీన్, అదనపు న్యాయమూర్తి రామారావు, ప్రభుత్వ ప్లీడర్ శివశంకర్‌రెడ్డి , జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జిలానీబాష, పలువురు న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

పూరిల్లు దగ్ధం.. వృద్ధుడి మృతి

సిద్దవటం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వంట చేసే యత్నంలో పూరింటికి మంటలంటుకోవడంతో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. గ్రామస్థుల కథనం ప్రకారం స్థానిక సత్రం వద్ద ఉన్న పూరిపాకలో పిల్లి రాజారెడ్డి (75) అనే వృద్ధుడు కొన్నేళ్లుగా నివసిస్తున్నాడు. అతనికి చూపు సరిగా లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అన్నం వండుకునే యత్నంలో అతను నివసిస్తున్న గుడిసెకు నిప్పంటుకుంది. ఆ మంటల నుంచి బయటపడలేక వృద్ధుడు మృతి చెందాడు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించాడు.

గల్ఫ్‌కు వెళ్లొద్దన్నారని ఆత్మహత్య

గాలివీడు, మార్చి23(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశానికి వెళ్లొద్దన్నారని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రామకృష్ణ కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన బూజెల లక్ష్మన్న కుమారుడు హరిప్రసాద్ (53) కువైత్‌కు వెళ్లి వచ్చాడు. మళ్లీ కువైట్‌కు వెళ్లాలని నిర్ణయించుకోగా కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శనివారం పక్కీరారెడ్డిగారిపల్లెలో నివాసం ఉంటున్న తన మేనల్లుడు ఎద్దుల ఈశ్వర్ ఇంటికి వచ్చి.. మద్యంలో విషం కలుపుకొని తాగాడు. దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న హరిప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

కలకడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్వారీ పేలుడుల్లో గాయపడిన రాము(45) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ నెల 20న మండలంలోని కోన గ్రామంలోని ఓ క్వారీలో నల్లమందు పేలడంతో అక్కడ పని చేస్తున్న కూలీ రాము గాయపడ్డాడు. అప్పటి నుంచి తిరుపతి రూయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిల్లలను ఎత్తుకెళుతున్నారని యాచకులపై దాడి

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను ఎత్తుకెళుతున్నారన్న అనుమానంతో కడప నగరంలోని చిలకలబావి వద్ద ఆదివారం స్థానికులు యాచకులను చితకబాదారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ నాగార్జున, ట్రాఫిక్ సీఐ జావీద్ అక్కడికి చేరుకుని విచారణ చేయగా, బాదితులు మహారాష్ట్రకు చెందిన వారని, కొద్ది రోజులుగా నగరంలో భిక్షాటన చేసుకుని జీవిస్తున్నట్లు తేలింది. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్థానికులకు సర్ది చెప్పారు. అనుమానం ఉంటే పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదని హితవు పలికారు. అనంతరం బాధితులను వారి రాష్ట్రానికి పంపించారు.

సెల్‌ఫోన్ దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ.18 లక్షల విలువైన సామగ్రి అగ్నికి ఆహుతి



దగ్దమవుతున్న దుకాణం

ఎర్రగుంట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో మొబైల్ ఫోన్ల దుకాణం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో అలీ అనే వ్యక్తి మొబైల్స్, సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతని దుకాణానికి మంటలు అంటుకున్నట్టు స్థానికులు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న అలీ ముందు గదిలో ఉన్న కొంత సామగ్రిని బయటికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంట లను ఆర్పివేశారు. ఈ సందర్భంగా బాధితుడు మా ట్లాడుతూ తాను, తన బావ రంతుల్లా బ్యాంకులో రుణం తీసుకుని దుకాణం నిర్వహి స్తున్నామని, పది రోజుల క్రితమే రూ.8 లక్షల విలువైన సరుకు తెచ్చామని, ఈ ప్రమాదంలో రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల విలువైన ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపాడు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



దానమయ్య (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు మండలంలోని జిల్లేళ్ల గ్రామానికి చెందిన తలారి దానమయ్య (46) ఆదివారం బైక్‌పై చాగలమర్రికి వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

క్రీడలతో విద్యా వికాసం

● జేఎన్టీయూ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

కలికిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలు వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, జట్టు స్ఫూర్తికి దోహదం చేస్తాయని కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో మూడు రోజులు జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, అనంతపురం జేఎన్టీయూ పీడీ జోజి రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొత్తం 830 విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టేబుల్ టెన్నిస్ (పురుషుల సింగిల్స్, పురుషులు డబుల్స్)లో విన్నర్‌గా జేఎన్టీయూ అనంతపురం, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్, నెల్లూరు నిలిచారు. టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్)లో జేఎన్టీ యూ అనంతపురం విన్నర్‌గా, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్ నెల్లూరు, టేబుల్ టెన్నిస్ (మహిళలు డబుల్స్)లో కూడా జేఎన్టీయూ అనంతపురం విన్నర్‌గా, పులివెందుల జేఎన్టీయూ రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (మహిళలు సింగిల్స్)లో కేఎంఎం కాలేజీ, తిరుపతి విన్నర్‌గా, జేఎన్టీయూ అనంతపురం రన్నర్‌గా, బ్యాడ్మింటన్ (మహిళలు డబుల్స్)లో కేఎంఎం తిరుపతి విన్నర్‌గా, గౌతమి కాలేజీ ప్రొద్దుటూరు రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (పురుషుల సింగిల్స్)లో మిట్స్ మదనపల్లె రన్నర్‌గా, ఎస్ఆర్‌ఈసీ నంద్యాల రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (పురుషులు డబుల్స్)లో మిట్స్ మదనపల్లె విన్నర్‌గా, విశ్వోదయ కావలి రన్నర్‌గా నిలిచాయి. త్రోబాల్ (మహిళలు)లో మదనపల్లె మిట్స్ విన్నర్‌గా, జేఎన్టీయూ కలికిరి రన్నర్‌గా నిలిచాయి. హ్యాండ్‌బాల్ (మహిళలు)లో పులివెందుల జేఎన్టీయూ విన్నర్‌గా, ఎన్‌బీకేఆర్ నెల్లూరు రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ (మహిళలు)లో తిరుపతి ఎస్వీసీఈ విన్నర్‌గా, అనంతపురం జేఎన్టీయూ రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో (పురుషులు)లో కలికిరి జేఎన్టీయూ విన్నర్‌గా, కేఎస్ఆర్ఎం కడప కాలేజీ రన్నర్‌గా, హ్యాండ్‌బాల్ (పురుషులు)లో పుత్తూరు సిద్దార్థ కాలేజీ విన్నర్‌గా, కలికిరి జేఎన్టీయూ రన్నర్‌గా,వాలీబాల్ (పురుషులు)లో పుత్తూరు సిద్దార్థ విన్నర్‌గా, మదనపల్లె మిట్స్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి.

పీలేరు హోతిశ్రీకి ప్రశంసలు

జేఎన్టీయూ కలికిరిలో జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల్లో పాల్గొన్న తిరుపతి కేఎంఎం కాలేజీలో చదువుతున్న హోతిశ్రీ బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్ సాధించింది. హోతిశ్రీ తండ్రి టి.ప్రభాకర్‌రెడ్డి బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్ ప్లేయర్. ఆ స్ఫూర్తితో హోతిశ్రీ కూడా బ్యాడ్మింటన్ ఆటను ఒంటబట్టించుకుని ఇంటర్ కాలేజియేట్ స్థాయిలో చాంపియన్‌గా నిలిచింది. తన తదుపరి లక్ష్యం అంతర్జాతీయ స్థాయిలో రాణించడమేనని హోతిశ్రీ తెలిపింది. అద్భుత పటిమతో హోతిశ్రీ అలవోకగా సాధించిన విజయాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.



జేఎన్టీయూ ప్రిన్సిపాల్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న హోతిశ్రీ



ఖోఖోలో విన్నర్‌గా నిలిచిన కలికిరి జేఎన్టీయూ పురుషుల జట్టు

మామిడిపై నీరుగారిన ఆశలు

చక్రాయపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అసలే కాపు తక్కువగా ఉందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో శనివారం వచ్చిన గాలివానకు అక్కడక్కడా ఉన్న కాయలు కూడా రాలిపోయాయి. మండలంలోని సురభి, రెడ్డివారిపల్లె, బండ్లయ్యగారిపల్లె, బీటిపల్లె, కుప్పగుట్టపల్లె, మల్లికవాండ్లపల్లె, పరికుంటపల్లె, ఉటుకూరువాండ్లపల్లె, పాయలోపల్లె తదితర గ్రామాల్లో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. శనివారం గాలివానకు మామిడి కాయలు రాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీనివాసరాజు

కడప ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షులుగా ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా, రాయచోటికి చెందిన కొండూరు శ్రీనివాసరాజు ఎంపిక య్యారు. రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకటరావు రాజీనామా చేయడంతో, ఆదివారం ఉదయం గుంటూరులోని ఎన్జీఓ హోంలో నిర్వ హించిన రాష్ట్ర తృతీయ కార్యవర్గ సమావేశంలో శ్రీనివాసరాజును అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏటీ రామకృష్ణమరాజు, గౌరవ అధ్యక్షుడు కూరాకు రవీంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫార్ కొండూరు శ్రీనివాసరాజును సన్మానించారు. ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎన్‌టీఏ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమారావు, ఉపాధ్యక్షుడు టీవీ నాగేశ్వరరావు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఐఎంసీకి బ్ర.మఠం విద్యార్థి ఎంపిక

బ్రహ్మంగారిమఠం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ పరిధిలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల స్థాయిలో ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ) ఎంట్రెన్స్‌లో కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం విద్యార్థిని సరయురెడ్డి ఎంపికైంది. ఈ విద్యార్థిని కొత్త ఓబులరాజుపల్లెకు చెందిన శీయపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మి దంపతుల కుమార్తె. హైదరాబాదులోని ఇంటర్నేషనల్ స్కూలులో ఏడో తరగతి చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

చవ్వా విజయశేఖర్‌రెడ్డి నేత్రదానం



కార్నియా సేకరిస్తున్న నిపుణులు


పులివెందుల టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం చవ్వా శుభాకర్‌రెడ్డి కాలనీకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖర్‌రెడ్డి (69) మరణించడంతో ఆయన భార్య సునీత, కుమారుడు దుష్యంత్‌రెడ్డి, కుమార్తె మధులిక, చెల్లెలు ప్రమీ లమ్మ, బావ వైఎస్ మనోహర్‌రెడ్డి, వదిన సులోచనమ్మ నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృతహస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజులకు సమాచారం అందించారు. దీంతో నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో బాధ పడుతూ ఈ లోకాన్ని చూడలేని అంధుల చూపు ఇచ్చే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు, బంధువులెవరైనా మరణించినా నేత్రదానం కోసం 9866727534 లేదా 70932 0453 కు సమాచారం ఇవ్వాలన్నారు.

గంజాయి స్వాధీనం.. ఆరుగురి అరెస్టు

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మాసాపేటలోని దొరల గోరీల వద్ద గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కడప డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్‌ఐలు హుసేన్, సిద్దయ్యతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన చల్లావినోద్, జన్నితి, నవనీష్‌కుమార్, షేక్ ఖాదర్, గూడె పవన్‌కుమార్‌నాయక్, షేక్ సమీర్, గోదాన సుధీర్ గంజాయి విక్రయిస్తున్నట్లు తెలియడంతో టూటౌన్ సీఐ నాగార్జున సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి, 1200 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు . నిందితులను రిమాండుకు తరలించినట్లు వివరించారు.

ఆస్తి కోసం అల్లుడికి చిత్రహింసలు

● మోసం చేసి పెళ్లి చేశారు ● రౌడీలతో కొట్టించారు ● బాధితుడి ఆవేదన



మీడియాకు తన గోడునువినిపిస్తున్న బాధితుడు హిదాయతుల్లా

రాయచోటిటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తన అత్త, బావమరిది, వారి అనుచరులు కలిసి తనను చిత్రహింసలకు గురి చేస్తున్నారని రాయచోటి పట్టణానికి చెందిన హిదుయతుల్లా మీడియాతో వాపోయాడు. రాయచోటిలోని కొత్తపల్లిలో ఓ ప్రైవేటు స్కూల్ నిర్వహిస్తున్న తనకు మూడేళ్ల క్రితం కలకడకు చెందిన యువతితో వివాహమైందని, ఆమెకు సంతానం కలిగే అవకాశం లేదన్న విషయం దాచిపెట్టి తనకు వివాహం చేశారని వివరించాడు. విడాకులు ఇచ్చేస్తానన్న అనుమానంతో తన అత్త, బావమరిది తనను బలవంతంగా కలకడకు తీసుకెళ్లి బంధించి రౌడీలతో కొట్టించారని, ఇంటి మీదికి తీసుకెళ్లి వెనుక వైపు ముళ్ల కంపలు ఉన్న వాగులో పడేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే స్టాంప్ పేపర్లు తెచ్చి తన ఆస్తిపాస్తులు రాసి ఇవ్వాలని చెప్పులతో మొహం పైన, చెరుకు గడలతో చితక బాదారన్నాడు. తన స్కూల్‌లో పనిచేసే యువతితో వివాహేతర సంబంధం ఉందని సృష్టించారని, ఆ విషయం చెప్పేందుకు ఆ యువతి కుటుంబ సభ్యులు వెనుకడుగు వేస్తున్నారన్నారు. తన ఫిర్యాదును పోలీసులు నమోదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోయాడు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

రాజంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ తులసి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి గాను 6, 11 తరగతుల్లో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలకు 9642918223కు సంప్రదించాలని ఆమె కోరారు.

లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 15 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మందికి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీ స్వరూప గుప్త, లయన్ నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు శివాలయంలో మండల పూజ

రామాపురం, మార్చి23(ఆంధ్రజ్యోతి): కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో బండపై వెలిసిన శివాలయంలో సోమవారం మండల పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం మహాగణపతి పూజ, మరకత శివ లింగానికి పంచలోహ ఉత్సవమూర్తుల పార్వతి, వినాయకుడు ధ్వజస్థంభం, నంది విగ్రహాలకు రుద్రాభిషేక పూజలు నిర్వహిస్తారని కార్యనిర్వాహకులు తెలిపారు. అనంతరం శివపార్వతుల కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణలు

రైల్వేకోడూరు, మార్చి 23:(ఆంధ్రజ్యోతి): 'నాకు కొంత, నీకు కొంత.. అందరం సమానంగా పంచుకుందాం. గత వైసీపీ హయాంలో ఆక్రమణల పై కొందరు నాయకులు పోరాటాలు చేశారు. మన ప్రభుత్వం వచ్చింది కదా ఏమి చేస్తే ఏముంది. అందిన కాడికి దోచుకుం దాం. ఎవరు ఆపేది. అంత దమ్ము ఉందా. సుప్రీం కోర్టు ఆదేశాలు ఉంటే ఏం చేస్తుంది. ఆక్రమణలు కొనసాగిస్తాం. ఉన్న కాడికి అమ్ముకుని తలా ఇంత పంచుకుని కడుపునింపుకుంటాం. ఎవరు అడ్డు వస్తారో చూద్దాం' అని కొందరు నాయకులు సవాలు విసురుతున్నారు. వివరాల్లోకి వెళితే.... రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లె పంచాయతీ పరిధి లోని సర్వే నెంబరు 2085లో సుమారు 17 ఎకరాలు ఉంది. ఈ సర్వే నెంబరులో నాలుగు లెటర్లు ఉన్నాయి. నాలుగోవ లెటర్‌లో 4.20 ఎకరాల ఖాళీ భూమి ఉంది. వైసీపీ పాలనలో ముస్లింలకు కొంత స్థలాన్ని కేటాయిస్తూ ఈద్గా నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణం జరిగే సమయం లో జనసేన నాయకులు అనేక రకాలు గా అడ్డుకునేందుకు పోరాటాలు చేశారు. దీని పై హై కోర్టుకు కూడా వెళ్లారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారడం తో ఈ స్థలం పై చాలా మంది



ఆక్రమణలో ఉన్న వంక పొరంబోకు భూమి ఇదే

కన్నుపడింది. ఇందు లో ఇప్పటికే 1.20 ఎకరాలు ఆక్రమణకు గురైంది. కొందరు ఆక్రమణ చేసుకున్న వారు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రంజాన్ మాసం రావడం తో ఈద్గా స్థలం తెరపై వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే ముస్లింలకు ఈద్గా స్థలాన్ని సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈద్గా స్థలం శుభ్రం చేసేందుకు ముస్లింలు, కూటమి నాయకులతో కలసి కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి స్థలం వద్ద వచ్చి పరిశీలించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన రెవెన్యూశాఖాధికారులకు ఆదేశించారు. రెవెన్యూ శాఖాధికారులతో చర్చించి తగు మంచి నిర్ణయం తీసుకుంటామని ఆయన ముస్లింలకు హామీ ఇవ్వడం జరిగింది. కాగా ఈ వంక పొరంబోకు భూమి ప్రధాన రహదారికి దగ్గరగా ఉండటం, రూ.కోట్లు విలువ పలుకుతుండటంతో అందరి దృష్టి దీనిపై పడటం కొసమెరుపు.

తహసీల్దార్ ఏమంటున్నారంటే...

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వంక పొరంబోకు స్థలం ఆక్రమించరాదని, కట్టడాలు చేయరాదని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. గతంలో ఏమి జరిగిందో తమకు తెలియదని తెలిపారు. ప్రస్తుతం ఈ భూమిని అన్ని సర్వే చేయించామన్నారు. ఎలాంటి కట్టడాలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచులు, నాయకులు వాటిపై ఎలాంటి హక్కులు ఉండవని వివరించారు.

వంక పొరంబోకు స్థలాన్ని కాపాడాలి

● కుడా చైర్మన్ ముక్కాకు దళిత నేత నాగరాజు వినతి



ముక్కా రూపానందరెడ్డిని సన్మానిస్తున్న కూని నాగరాజు

రైల్వేకోడూరు, మార్చి 23(ఆంధ్ర జ్యోతి): వ ండ లం లోని మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలోని వంక పొరంబోకు స్థలాన్ని కాపాడాలని కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డికి ఆయన నివాసంలో ఆదివారం రైల్వేకోడూరు నియోజకవర్గ దళిత నాయకుడు కూని నాగరాజు విన్నవించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసూరివారిపల్లె పం చాయతీ పరిధిలో ఉన్న వంక పొరంబోకు స్థలం ఆక్రమణకు గురైందన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

తిరునాళ్లలో నృత్యం చేయిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

సుండుపల్లె, మార్చి23(ఆంధ్రజ్యోతి): తిరునాళ్లలో నృత్యం చేయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తిరునాళ్లలో విచ్చలవిడిగా డ్యాన్సులు చేయడం చట్ట విరుద్ధమన్నారు. కోలాటాలు, చెక్కభజనను వేసుకోవాలి తప్ప అశ్లీల నృత్యాలను ప్రోత్సహించరాదన్నారు. 144 సెక్షన్‌లో 30 యాక్ట్ అమల్లో ఉంటుందని, భక్తిభావాలతో నిర్వహించాలని బండ్లు కట్టే వారికి సూచించారు. ఇప్పటికే పలువురికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలియజేశారు. అసభ్యకర డ్యాన్సులతో భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని ఆయన పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో జాతరకు బండ్లు కట్టాలని తెలియజేశారు.

పేదలకు అండగా ప్రభుత్వం



టీడీపీ సభ్యత్వం కార్డులు పంపిణీ చేస్తున్న అమావాస్య రెడ్డెయ్య

రాయచోటిటౌన్, మార్చి23(ఆంధ్ర జ్యోతి): పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీడీపీ ఎస్టీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అమామాస్య రెడ్డెయ్య అన్నారు. ఆదివారం ఆయన రాయచోటి మున్సిపాలిటీలోని 19వ వార్డులో గల పోలింగ్ భూత్‌లు 103, 104, 105ల పరిధిలో టీడీపీ సభ్యత్వం పొందిన వారికి సభ్యత్వం కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నారా చంద్రబాబునాయుడు, యువగళం పా దయాత్ర సందర్భంగా ఐటీ విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీల మేరకు పేద ప్రజలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా నిలుస్తున్నారన్నారు.

దళితుల భూములు దళితులకే అందాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లె శేఖర్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 23(ఆంధ్రజ్యోతి):దళితుల భూములు అగ్రవర్ణాల వారు ఆక్రమించుకున్నారని రెవెన్యూ అధికారులు పరిశీలించి దళిత భూములు దళితులకు అందేటట్లు చూడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లె శేఖర్ పేర్కొన్నారు. ఆదివారం భూడిదగుంటపల్లెలో ఆయన పర్యటించి పలపతి గంగులమ్మ అనే వృద్ధిరాలుది సర్వేనెంబర్ 783లో 3.83 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణాలవారు ఆక్రమించుకున్నారని బాధితరాలు గంగులమ్మ తెలిపారన్నారు. గంగులమ్మ భూమిని ఎలాగైనా అగ్రవర్ణాల వారి నుంచి రెవెన్యూ అధికారులతో మాట్లాడి కచ్చితంగా ఇప్పిస్తామని ఆయన గంగులమ్మకు హామీ ఇచ్చారు. భూమిలోకి వెళితే అగ్రవర్ణాల వారు బెదిరిస్తున్నారని, ఎలాగైనా తన భూమిని కాపాడలని దళిత సంఘ నాయకులను గంగులమ్మ కోరింది. గంగులమ్మ భూమి అగ్రవర్ణాల నుంచి రెవెన్యూ అధికారులు తిరిగి ఇప్పించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలక్రిష్ణబాబు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రెడ్డివారిపల్లెలో ఉపాధి కార్మికులతో కలిసి పనిచేస్తున్న చంద్రశేఖర్

రైల్వేకోడూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికుల సమస్యల ను పరిష్కరించాల ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి కూలి డబ్బు రావడం లేదని కార్మికులు తెలిపారన్నారు. కూలి కూడా రూ.200, రూ.250 కంటే ఎక్కువ రావడం లేదన్నారు. కనీస కూలి రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. గడ్డపారలు, పారలు, గోళాలు అందజేతలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా కొండూరు శ్రీనివాసరాజు



రాయచోటిటౌన్, మార్చి23(ఆంధ్ర జ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి చెందిన కొండూరు శ్రీనివాసరాజు ఎంపికయ్యారు. ఆదివారం ఉదయం గుంటూరులోని ఎన్జీవో హోంలో నిర్వహించిన ఎన్‌టీఏ రాష్ట్రాల తృతీయ కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఆయన్ను ఎన్నుకున్నారు. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నడిపినేని వెంకటాద్రి రాజీనామా చేయడంతో ఈ ఎంపిక అనివార్యమైంది. ఈ సందర్భంగా ఎన్‌టీఏ నూతన అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు మా ట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చేకూరి సుభాశ్‌చంద్రబోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీబీ నాగేశ్వరరావు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై నేడు అవగాహన ర్యాలీ

రాయచోటిటౌన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): నేడు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవంపై మెగా ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా అదనపు అధికారి డాక్టర్ శైలజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్షయ వ్యాధిపై అవగాహన కోసం సోమవారం ఉదయం 8.30 గంటలకు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి నుండి జిల్లా పాలానాధికారి జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

టిప్పర్, స్కూటర్ ఢీ- వ్యక్తికి తీవ్రగాయాలు

రామాపురం, మార్చి23(ఆంధ్రజ్యోతి): రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం స్కూటర్‌ను టిప్పర్ ఢీకొనడంతో జంపు మహేశ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ అమర్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... చక్రాయపేట మండలం సురభి గ్రామం కుప్పగుట్టపల్లికి చెందిన జంపు మహేశ్ కడప ఇండియన్ గ్యాస్ గోడౌన్‌లో లారీ డ్రైవర్‌గా పని చేసేవాడని, పని ముగించుకుని చక్రాయపేటకు స్కూటర్‌పై బయలుదేరి గువ్వలచెరువు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మీదుగా ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలోకి రాగానే రామాపురం మండలం గువ్వలచెరువు పెట్రోల్ బంకు సమీపంలో టిప్పర్ ఢీకొంది. దీంతో మహేశ్‌కు రెండు కాళ్లు రక్తగాయాలయ్యాయి. పోలీసులు కడప రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రమాదేవి ప్రైవేటు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ అమర్‌కుమార్ తెలిపారు.

నాగారపమ్మ తల్లికి బోనాలు





సుండుపల్లె: ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ.. పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి

సుండుపల్లె, మార్చి23(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలం ఈడిగపల్లె సమీపంలో వెలిసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల నుంచి కూడా భక్తులు హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మామిడి తోటల్లో విందారగించారు.

ముగిసిన గంగమ్మ తిరునాళ్లు

బండకాడ ఈడిగపల్లె వద్ద వెలిసిన గంగమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. చాందినీ బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అంగరంగ వైభవంగా తిరునాళ్లు ముగిసింది. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

లక్కిరెడ్డిపల్లెలో...

మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం పూజలు నిర్వహించారు. గంగమ్మజాతర ముగిసిన మూడవ ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చెల్లు గంగరాజుయాదవ్, దినేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవటంలో...

మండలంలోని మాచుపల్లెలో గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట కూటమి నేతలు. జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ, అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, అధికార ప్రతినిది మేడా విజయశేఖర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. విందులో పాల్గొన్నారు. బీసీ సంఘం కార్యనిర్వహణ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జవహర్‌బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్‌నాయుడు, గజ్జల బాలిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో గ్రామ సూచిక బోర్డు



ముళ్లపొదల్లో దర్శనమిస్తున్న సంటిగారిపల్లె నేమ్ బోర్డు

సిద్దవటం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సంటిగారిపల్లె గ్రామ సూచికబోర్డు ముళ్ల పొదలు అలుముకుపోవడంతో కొత్త వ్యక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని మాచుపల్లె కడప రహదారిలో ఉన్న సంటిగారిపల్లె గ్రామ సూచికబోర్డు ముళ్లపొదల్లో అలుముకుపోవడంతో కొత్త వ్యక్తులకు గ్రామం ఎక్కడో తెలియక ఇబ్బందులు పడుతూ సంటిగారిపల్లె ఎక్కడ అంటూ కొంతమందిని అడుగుతూ ఆ గ్రామంలోకి వెళుతున్నారు. ఇదే రహదారిన మండల అధికారులు పల్లె గ్రామాలకు వెళుతున్నా ఏ మాత్రం పట్టించుకోలేదని ఆ ప్రాంతవాసులు తెలిపారు. అధికారులు స్పందించి సూచిక బోర్డు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరుతున్నారు. ఆర్‌అండ్‌బి ఏఈ గంగిరెడ్డిని వివరణ కోరగా మూలపల్లెలోఉన్న నేమ్ బోర్డు ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన యండపల్లె గ్రామంలో పశువుల షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులు ఎండ, వాన, గాలికి గురికాకుండా ఆరోగ్యంగా జీవించేందుకు ప్రభుత్వం పశువుల షెడ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. అనంతరం యండపల్లిలో బోరుకు మోటారు బిగించి గ్రామానికి నీటి సరఫరా అందించారు. టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి ఏర్పాటు చేసిన విందు భోజనానికి హాజరయ్యారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు మానవత కృషి



మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

రాయచోటి టౌన్, మార్చి23(ఆంధ్ర జ్యోతి): సమాజ శ్రేయస్సుకు మానవత సంస్థ కృషి చేస్తోందని ప్రముఖ న్యాయవాది చింతకుంట సునీల్‌కుమార్‌రెడ్డి, వైద్యాధికారి భానుప్రకాశ్, లయన్ నాగేశ్వరరావులు పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలో మనవతా సంస్థ అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్‌బాషా, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ ససందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్థిక సాయం, రోగులకు అంబులెన్స్, మృతి చెందిన వారిని అంత్యక్రియలకు శాంతిరథం, బాడీ ఫ్రీజర్లు అందించడం ఉపయోగపడటం అభినందనీయమన్నారు. అనంతరం అతిధులను సత్కరించారు. ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, కన్వీనర్ చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, కో చైర్మన్ షకీల్, మాజీ అధ్యక్షుడు వెంకట్రమణ, గంగాధర్‌నాయుడు, జాయింట్ సెక్రటరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

రాజంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం రాజంపేట ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు జమాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 12 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగినా దీని గురించి పట్టించుకోలేదన్నారు. వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారన్నారు. వీరందనిరి దృష్టిలో ఉంచుకుని సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు.నియోజకవర్గ ఏఐటీయూసీ నాయకులు సికిందర్, ఆటో వర్కర్ యూనియన్ నాయకులు నాగేశ్వర్‌రావు, భవన నిర్మాణ కార్మికులు సుబ్రమమణ్యం, ఏఐటీయూసీ ముజఫర్, టైల్స్ వర్కర్ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు సేవా పతక గ్రహీతకు సత్కారం



ఎస్ఐ రామ్మోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నందలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి పోలీసు శాఖ ద్వారా ఉగాది పురస్కారాల సందర్భంగా సేవా పతకం పురస్కారానికి ఎంపికైనందుకు స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎస్ఐ మన్నెం రామమోహన్‌ను బచ్చు భవన్‌లో ఆదివారం సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన విభ ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయభాస్కర్‌రావు, నందలూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ రామ్మోహన్‌కు పతకం రావడం గర్వకారణమన్నారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్ట్

నందలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చెయ్యేరులో కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రూ.2270 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ సుబ్బరాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చేనేత కార్మికుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి

సిద్ధవటం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్ గ్రామంలో ఆదివారం భద్రావతి భావనారాయణ చేనేత సొసైటీని నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభోత్సవం చేశారు. ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పార్టీ టీడీపీ అన్నారు. నియోజకవర్గంలో ఐదు చేనేత సొసైటీలు ప్రారంభించామన్నారు. గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎన్వీ రమణ, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉత్త రామచంద్రయ్య, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, చేనేత సొసైటీ చైర్మన్ జింక శ్రీనివాసులు, తెలుగు యువత మండల అధ్యక్షుడు పుత్తా సుధీర్‌రాయల్, నాయకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

రాయచోటిటౌన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): యువత సర్దార్ భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జక్కుల వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని దివ్యతేజ హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఈ. నాగేశ్వరరావు, శంకర్‌ల చేతుల మీదుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి

రాజంపేట టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ మండల నాయకులు వినోద్, వెంకట మహిందర్, రవి, హరి, షేక్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ గురించి ఉపాధ్యాయుడు రమణ విద్యార్థులకు వివరించారు.

పాలకుల దోపిడీని ప్రశ్నించాలి: ఏఐటీయూసీ

రైల్వేకోడూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పాలకుల దోపిడీని ప్రజలు ప్రశ్నించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో ఆయనకు నివాళులర్పించారు.

మద్యం మత్తులో బండి నడిపితే.. కేసులే..!

● డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ చర్యలు కట్టుదిట్టం


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

పులివెందుల టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) :మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. పులివెందుల ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కేసులు పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే చోటు చేసుకుంటున్నట్లు పోలీసుల పరిశీలనలో తెలిసింది. ఈ నేపథ్యంలో పులివెందుల ట్రాఫిక్ పోలీసులు పార్నపల్లె రోడ్డు, ఆర్టీపీ బస్టాండు కూడలి, ముద్దనూరు రోడ్డు, ఉలిమెల్ల రోడ్డు, కడప రోడ్డు, పూలంగళ్ల సర్కిల్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బ్రీత్ అనలైజరు ద్వారా పరీక్షలు చేస్తూ వాహనదారులు ఎవరైనా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయితే తక్షణమే కేసులు నమోదు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, కారు, జీపులు, ఆటోలు, లారీ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతున వారిలో ఉంటున్న వీరిలో లారీలు, ఆటో డ్రైవర్లే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం తాగి బైకులు నడుపుతూ పట్టుబడుతున్న వారిలో యువకులు ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందని పోలీసులు చెబుతున్నారు. దీంతో మత్తు దిగిన తరువాత యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామని చెబుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చేతివాటం..?

తనిఖీల పేరుతో పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తున్నారని డ్రంకెన్ డ్రైవ్ పేరుతో అకారణంగా వేధిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్సు, సీ-బుక్ తీసుకుని, వాహనాలను స్టేషన్‌లో ఉంచుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు అంటున్నారు. అదే విధంగా డ్రంకెన్ డ్రైవ్‌లో తనిఖీల సమయంలో మందుబాబుల వద్ద పలువురు పోలీ సులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మందు తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే ఆ కేసుతో సరిపెట్టకుండా లైసెన్సు, సీ బుక్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి కూడా అడుగుతున్నారని, వాటిలో ఏమీ లేకున్నా భారీగా జరిమానాలు విధిస్తున్నా రని వాహనదారులు వాపోతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదంటూ ఇతర సాకులు చూపుతూ సెల్ ఫొటోలు తీసి ఈ-చలా నాలతో బెంబేలెత్తిస్తున్నారని ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. నిబంధనల మేరకే కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు అంటున్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కడప స్పోర్ట్స్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. ఆదివారం స్థానిక పీవీఆర్ ఇండోర్ స్టేడియంలో న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ పని ఒత్తిడితో సతమతమయ్యే న్యాయశాఖ ఉద్యోగులకు క్రీడలు కాసింత మానసిక ఉపశమనాన్ని అందిస్తాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బాబాఫకృద్దీన్, అదనపు న్యాయమూర్తి రామారావు, ప్రభుత్వ ప్లీడర్ శివశంకర్‌రెడ్డి , జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జిలానీబాష, పలువురు న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ ఆడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో.. చోరీలకు చెక్!

● దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే ఇట్టే పట్టేస్తుంది
● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
● 13 నెలల్లో 621 మంది వినియోగం

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా కలిసి ఎక్కడికైనా వెళుతున్నారా.. మీ ఇంట్లో విలువైన సామాన్లు గట్రా ఉన్నాయా, ఎక్కడికైనా వెళ్లాలంటే భయపడుతున్నారా..? అయితే ఇప్పటి నుంచి ఆ భయాన్ని మానుకోండి. దొంగలను ఇట్టే పట్టించే యాప్ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంది. జిల్లాలోని ప్రజలు జిల్లా పోలీసు శాఖ అంది స్తున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్ హెచ్‌ఎంఎస్) యాప్‌ను సద్వినియోగం చేసుకోవ డం ద్వారా దొంగతనాలు అరికట్టేందుకు ఎల్‌హెచ్ ఎంఎస్ యాప్‌ను మొబైల్ ఫోనుతో అనుసంధా నం చేసుకుంటే ఇంటికి తాళం వేసి ఎక్కడి కైనా నిశ్చింతగా వెళ్లవచ్చు. మీ మొబైల్ ఫోను ద్వారా మీ ఇంట్లోని పరిస్థితిని సమీక్షించవచ్చు. పోలీసుస్టేషన్‌ల ద్వారా నిఘా ఉంచి దొంగలు ఇం ట్లోకి ప్రవే శిస్తే ఇట్టే పట్టేసే అవకాశం ఈ యాప్ వినియోగం ద్వారా లభిస్తుంది. జనవరి నుంచి ఇప్పటి మార్చి వరకు జిల్లా వ్యాప్తంగా 621 మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఎవరైనా ఊర్లకు వెళ్లేవారు ఈ యాప్‌ను వినియోగించుకుంటే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చు. జిల్లాలోని కడప నగరంతో పాటు ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, జమ్మల మడుగు, ఎర్రగుంట్ల, బద్వేలు మున్సిపాలిటీలలో యాప్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఎస్పీ తెలిపారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ మొబైల్ కలిగిన వారు ముం దుగా ప్లేస్టోరులోకి వెళ్లి లాక్డ్‌హౌస్ మాని టరింగ్ సిస్టం అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలి. యాప్‌ను ఓపెన్ చేయగానే రిజిస్టరు, రిక్వెస్ట్ పోలీసు వాచ్ అనే రెండు ఆప్ష న్లు కనిపిస్తాయి. ముందుగా రిజిస్టరును ఎంచుకుని అక్కడ మీ పేరుతో పాటు, అడ్రస్, సెల్ నెంబరు ఎంటర్ చేయాలి. గెట్ మై లొకేషన్ ఆప్షన్ కూడా ఉంటుంది. దానిపై క్లిక్ చేసి ఇంటి లొకేషన్ గూగుల్ మ్యాప్ ద్వారా అందులో ఎంట్రీ చేయాలి. ఇదంతా ఇంటిలోనే కూర్చునే చేయవచ్చు. తద్వారా పోలీసులు మన ఇంటికి భద్రత ఇవ్వడానికి సులువైన మార్గం ఏర్పడుతుంది. ఆ తరువాత ఒక యూజర్ ఐడీ జనరేట్ అవుతుంది. దాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలి.

నిర్లక్ష్యమే చోరీలకు కారణం


ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌పై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించకుండానే ఊర్లకు వెళుతుంటారు. వారు తిరిగి వచ్చేసరికి దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమే మంచిది.

ఇంటికి రక్షణ..

లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా ప్రజల ఆస్తులను రక్షించవచ్చని చెప్పవచ్చు. ఊరెళ్లే ముందు సమాచారం అందిస్తే, పోలీసులు ఆ ఇంటిలో కెమెరాను అమర్చి, చోరీలకు ప్రయత్నించిన దొంగలను తక్షణమే పట్టుకునే అవకాశం లభిస్తుంది.

కెమెరాలే దొంగను పట్టిస్తాయి

అత్యవసర సమయాల్లో యాత్రలు, ఆసుపత్రులు, ఇతర ఊర్లకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వెంటనే పోలీసులు కాపలాగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ నుంచే ఇంట్లో ఏం జరుగుతుందో నిఘా పెడతారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సెల్‌ఫోను ద్వారా మన ఇంటిని మనం చూసుకోవచ్చు. ఒకవేళ దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే పోలీసులు అమర్చిన కెమెరాలు పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటరుకు క్షణాల్లో సమాచారాన్ని అందిస్తాయి. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి క్షణాల్లో దొంగలను పట్టుకునే వీలవుతుంది.



సద్వినియోగం చేసుకోండి

ప్రజలు ఈ యాప్ ద్వారా పోలీసు సేవలను ఉపయోగించుకుని విలువైన వస్తువులకు రక్షణ కల్పించుకోవాలి. ప్రజలందరూ సహకరిస్తే చోరీలను అరికట్టడమే కాక, దొంగల ఆటలను సులువుగా కట్టించవచ్చు. సంప్రదించాల్సిన ఎల్‌హెచ్‌ఎంఎస్ నెం.8186881100, ప్లేస్టోర్‌లో అయితే ఎల్‌హెచ్ ఎంఎస్, ఏపీ పోలీసు యాప్ అందుబాటులో ఉంటుంది.

-వెంకటేశ్వర్లు, సీఐ, కమాండ్ అండ్ కంట్రోల్

పూరిల్లు దగ్ధం.. వృద్ధుడి మృతి

సిద్దవటం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వంట చేసే యత్నంలో పూరింటికి మంటలంటుకోవడంతో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. గ్రామస్థుల కథనం ప్రకారం స్థానిక సత్రం వద్ద ఉన్న పూరిపాకలో పిల్లి రాజారెడ్డి (75) అనే వృద్ధుడు కొన్నేళ్లుగా నివసిస్తున్నాడు. అతనికి చూపు సరిగా లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అన్నం వండుకునే యత్నంలో అతను నివసిస్తున్న గుడిసెకు నిప్పంటుకుంది. ఆ మంటల నుంచి బయటపడలేక వృద్ధుడు మృతి చెందాడు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించాడు.

గల్ఫ్‌కు వెళ్లొద్దన్నారని ఆత్మహత్య

గాలివీడు, మార్చి23(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశానికి వెళ్లొద్దన్నారని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రామకృష్ణ కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన బూజెల లక్ష్మన్న కుమారుడు హరిప్రసాద్ (53) కువైత్‌కు వెళ్లి వచ్చాడు. మళ్లీ కువైట్‌కు వెళ్లాలని నిర్ణయించుకోగా కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శనివారం పక్కీరారెడ్డిగారిపల్లెలో నివాసం ఉంటున్న తన మేనల్లుడు ఎద్దుల ఈశ్వర్ ఇంటికి వచ్చి.. మద్యంలో విషం కలుపుకొని తాగాడు. దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న హరిప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

కలకడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్వారీ పేలుడుల్లో గాయపడిన రాము(45) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ నెల 20న మండలంలోని కోన గ్రామంలోని ఓ క్వారీలో నల్లమందు పేలడంతో అక్కడ పని చేస్తున్న కూలీ రాము గాయపడ్డాడు. అప్పటి నుంచి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిల్లలను ఎత్తుకెళుతున్నారని యాచకులపై దాడి

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను ఎత్తుకెళుతున్నారన్న అనుమానంతో కడప నగరంలోని చిలకలబావి వద్ద ఆదివారం స్థానికులు యాచకులను చితకబాదారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ నాగార్జున, ట్రాఫిక్ సీఐ జావీద్ అక్కడికి చేరుకుని విచారణ చేయగా, బాధితులు మహారాష్ట్రకు చెందిన వారని, కొద్ది రోజులుగా నగరంలో భిక్షాటన చేసుకుని జీవిస్తున్నట్లు తేలింది. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్థానికులకు సర్ది చెప్పారు. అనుమానం ఉంటే పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదని హితవు పలికారు. అనంతరం బాధితులను వారి రాష్ట్రానికి పంపించారు.

సెల్‌ఫోన్ దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ.18 లక్షల విలువైన సామగ్రి అగ్నికి ఆహుతి


దగ్ధమవుతున్న దుకాణం

ఎర్రగుంట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో మొబైల్ ఫోన్ల దుకాణం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో అలీ అనే వ్యక్తి మొబైల్స్, సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతని దుకాణానికి మంటలు అంటుకున్నట్టు స్థానికులు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న అలీ ముందు గదిలో ఉన్న కొంత సామగ్రిని బయటికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంట లను ఆర్పివేశారు. ఈ సందర్భంగా బాధితుడు మా ట్లాడుతూ తాను, తన బావ రంతుల్లా బ్యాంకులో రుణం తీసుకుని దుకాణం నిర్వహి స్తున్నామని, పది రోజుల క్రితమే రూ.8 లక్షల విలువైన సరుకు తెచ్చామని, ఈ ప్రమాదంలో రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల విలువైన ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపాడు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


దానమయ్య (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు మండలంలోని జిల్లేళ్ల గ్రామానికి చెందిన తలారి దానమయ్య (46) ఆదివారం బైక్‌పై చాగలమర్రికి వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

క్రీడలతో విద్యా వికాసం

● జేఎన్టీయూ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

కలికిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలు వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, జట్టు స్ఫూర్తికి దోహదం చేస్తాయని కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో మూడు రోజులు జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, అనంతపురం జేఎన్టీయూ పీడీ జోజి రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొత్తం 830 విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టేబుల్ టెన్నిస్ (పురుషుల సింగిల్స్, పురుషులు డబుల్స్)లో విన్నర్‌గా జేఎన్టీయూ అనంతపురం, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్, నెల్లూరు నిలిచారు. టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్)లో జేఎన్టీ యూ అనంతపురం విన్నర్‌గా, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్ నెల్లూరు, టేబుల్ టెన్నిస్ (మహిళలు డబుల్స్)లో కూడా జేఎన్టీయూ అనంతపురం విన్నర్‌గా, పులివెందుల జేఎన్టీయూ రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (మహిళలు సింగిల్స్)లో కేఎంఎం కాలేజీ, తిరుపతి విన్నర్‌గా, జేఎన్టీయూ అనంతపురం రన్నర్‌గా, బ్యాడ్మింటన్ (మహిళలు డబుల్స్)లో కేఎంఎం తిరుపతి విన్నర్‌గా, గౌతమి కాలేజీ ప్రొద్దుటూరు రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (పురుషుల సింగిల్స్)లో మిట్స్ మదనపల్లె రన్నర్‌గా, ఎస్‌ఆర్‌ఈసీ నంద్యాల రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (పురుషులు డబుల్స్)లో మిట్స్ మదనపల్లె విన్నర్‌గా, విశ్వోదయ కావలి రన్నర్‌గా నిలిచాయి. త్రోబాల్ (మహిళలు)లో మదనపల్లె మిట్స్ విన్నర్‌గా, జేఎన్టీయూ కలికిరి రన్నర్‌గా నిలిచాయి. హ్యాండ్‌బాల్ (మహిళలు)లో పులివెందుల జేఎన్టీయూ విన్నర్‌గా, ఎన్‌బీకేఆర్ నెల్లూరు రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ (మహిళలు)లో తిరుపతి ఎస్వీసీఈ విన్నర్‌గా, అనంతపురం జేఎన్టీయూ రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో (పురుషులు)లో కలికిరి జేఎన్టీయూ విన్నర్‌గా, కేఎస్‌ఆర్‌ఎం కడప కాలేజీ రన్నర్‌గా, హ్యాండ్‌బాల్ (పురుషులు)లో పుత్తూరు సిద్దార్థ కాలేజీ విన్నర్‌గా, కలికిరి జేఎన్టీయూ రన్నర్‌గా,వాలీబాల్ (పురుషులు)లో పుత్తూరు సిద్దార్థ విన్నర్‌గా, మదనపల్లె మిట్స్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి.

పీలేరు హోతిశ్రీకి ప్రశంసలు

జేఎన్టీయూ కలికిరిలో జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల్లో పాల్గొన్న తిరుపతి కేఎంఎం కాలేజీలో చదువుతున్న హోతిశ్రీ బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్ సాధించింది. హోతిశ్రీ తండ్రి టి.ప్రభాకరరెడ్డి బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్ ప్లేయర్. ఆ స్ఫూర్తితో హోతిశ్రీ కూడా బ్యాడ్మింటన్ ఆటను ఒంటబట్టించుకుని ఇంటర్ కాలేజియేట్ స్థాయిలో చాంపియన్‌గా నిలిచింది. తన తదుపరి లక్ష్యం అంతర్జాతీయ స్థాయిలో రాణించడమేనని హోతిశ్రీ తెలిపింది. అద్భుత పటిమతో హోతిశ్రీ అలవోకగా సాధించిన విజయాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.


జేఎన్టీయూ ప్రిన్సిపాల్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న హోతిశ్రీ


ఖోఖోలో విన్నర్‌గా నిలిచిన కలికిరి జేఎన్టీయూ పురుషుల జట్టు

మామిడిపై నీరుగారిన ఆశలు

చక్రాయపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అసలే కాపు తక్కువగా ఉందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో శనివారం వచ్చిన గాలివానకు అక్కడక్కడా ఉన్న కాయలు కూడా రాలిపోయాయి. మండలంలోని సురభి, రెడ్డివారిపల్లె, బండ్లయ్యగారిపల్లె, బీటీపల్లె, కుప్పగుట్టపల్లె, మల్లికవాండ్లపల్లె, వరికుంటపల్లె, ఉటుకూరువాండ్లపల్లె, పాయలోపల్లె తదితర గ్రామాల్లో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. శనివారం గాలివానకు మామిడి కాయలు రాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీనివాసరాజు

కడప ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షులుగా ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా, రాయచోటికి చెందిన కొండూరు శ్రీనివాసరాజు ఎంపిక య్యారు. రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకటరావు రాజీనామా చేయడంతో, ఆదివారం ఉదయం గుంటూరులోని ఎన్జీఓ హోంలో నిర్వ హించిన రాష్ట్ర తృతీయ కార్యవర్గ సమావేశంలో శ్రీనివాసరాజును అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏటీ రామకృష్ణమరాజు, గౌరవ అధ్యక్షుడు కూరాకు రవీంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫార్ కొండూరు శ్రీనివాసరాజును సన్మానించారు. ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎన్‌టీఏ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమారావు, ఉపాధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఐఎంసీకి బి.మఠం విద్యార్థి ఎంపిక

బ్రహ్మంగారిమఠం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ పరిధిలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల స్థాయిలో ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ) ఎంట్రెన్స్‌లో కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం విద్యార్థిని సరయురెడ్డి ఎంపికైంది. ఈ విద్యార్థిని కొత్త ఓబులరాజుపల్లెకు చెందిన శీయపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మి దంపతుల కుమార్తె. హైదరాబాదులోని ఇంటర్నేషనల్ స్కూలులో ఏడో తరగతి చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

చవ్వా విజయశేఖర్‌రెడ్డి నేత్రదానం


కార్నియా సేకరిస్తున్న నిపుణులు

పులివెందుల టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం చవ్వా శుభాకర్‌రెడ్డి కాలనీకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖర్‌రెడ్డి (69) మరణించడంతో ఆయన భార్య సునీత, కుమారుడు దుష్యంత్‌రెడ్డి, కుమార్తె మధులిక, చెల్లెలు ప్రమీ లమ్మ, బావ వైఎస్ మనోహర్‌రెడ్డి, వదిన సులోచనమ్మ నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృతహస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం అందించారు. దీంతో నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో బాధ పడుతూ ఈ లోకాన్ని చూడలేని అంధుల చూపు ఇచ్చే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు, బంధువులెవరైనా మరణించినా నేత్రదానం కోసం 9866727534 లేదా 709320453 కు సమాచారం ఇవ్వాలన్నారు.

గంజాయి స్వాధీనం.. ఆరుగురి అరెస్టు

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మాసాపేటలోని దొరల గోరీల వద్ద గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కడప డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్‌ఐలు హుసేన్, సిద్దయ్యతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన చల్లావినోద్, జస్గిత్, నవనీష్‌కుమార్, షేక్ ఖాదర్, గూడె పవన్‌కుమార్‌నాయక్, షేక్ సమీర్, గోదాన సుధీర్ గంజాయి విక్రయిస్తున్నట్లు తెలియడంతో టూటౌన్ సీఐ నాగార్జున సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి, 1200 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు . నిందితులను రిమాండుకు తరలించినట్లు వివరించారు.

ఆస్తి కోసం అల్లుడికి చిత్రహింసలు

● మోసం చేసి పెళ్లి చేశారు ● రౌడీలతో కొట్టించారు ● బాధితుడి ఆవేదన


మీడియాకు తన గోడునువినిపిస్తున్న బాధితుడు హిదాయతుల్లా

రాయచోటిటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తన అత్త, బావమరిది, వారి అనుచరులు కలిసి తనను చిత్రహింసలకు గురి చేస్తున్నారని రాయచోటి పట్టణానికి చెందిన హిదుయతుల్లా మీడియాతో వాపోయాడు. రాయచోటిలోని కొత్తపల్లిలో ఓ ప్రైవేటు స్కూల్ నిర్వహిస్తున్న తనకు మూడేళ్ల క్రితం కలకడకు చెందిన యువతితో వివాహమైందని, ఆమెకు సంతానం కలిగే అవకాశం లేదన్న విషయం దాచిపెట్టి తనకు వివాహం చేశారని వివరించాడు. విడాకులు ఇచ్చేస్తానన్న అనుమానంతో తన అత్త, బావమరిది తనను బలవంతంగా కలకడకు తీసుకెళ్లి బంధించి రౌడీలతో కొట్టించారని, ఇంటి మీదికి తీసుకెళ్లి వెనుక వైపు ముళ్ల కంపలు ఉన్న వాగులో పడేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే స్టాంప్ పేపర్లు తెచ్చి తన ఆస్తిపాస్తులు రాసి ఇవ్వాలని చెప్పులతో మొహం పైన, చెరుకు గడలతో చితక బాదారన్నాడు. తన స్కూల్‌లో పనిచేసే యువతితో వివాహేతర సంబంధం ఉందని సృష్టించారని, ఆ విషయం చెప్పేందుకు ఆ యువతి కుటుంబ సభ్యులు వెనుకడుగు వేస్తున్నారన్నారు. తన ఫిర్యాదును పోలీసులు నమోదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోయాడు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

పీలేరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం వగళ్లలోని కేజీబీవీ పాఠశాలలో 6, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రావణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, బీపీఎల్‌కు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థినులకు వారి ఫోన్‌లకు మెసేజ్‌ల ద్వారా సమాచారం అందిస్తామని ఆమె తెలిపారు.

ములకలచెరువు కేజీబీవీలో..

ములకలచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కరీమాబీ తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వచ్చేనెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కురబలకోట కేజీబీవీలో..

కురబలకోట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు సమీపంలో ఉన్న కేజీబీవీలో అడ్మిషన్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో రఫియా పర్వీన్ పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంతో పాటు మిగిలిన ఖాళీ సీట్లకు ఏప్రిల్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7816031367, 9493626856 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బాకా సాంబశివయ్య

వాల్మీకిపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బాకా సాంబశివయ్య నియమితులయ్యారు. రాయచోటిలో పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సాంబశివయ్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చింతకాయలు కోస్తూ కింద పడి వ్యక్తికి గాయాలు

నిమ్మనపల్లె మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చెట్టెక్కి చింతకాయలు కోస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన సంఘటన నిమ్మనపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం గంగాపురంవారిపల్లెకు చెందిన రామకృష్ణ (50) ఆదివారం పొరుగు గ్రామంలో ఓ రైతుకు చెందిన చింత చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. వెంటనే రామకృష్ణను కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

అంకితభావంతో పని చేయాలి : ఎస్‌ఐ

గుర్రంకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి):ప్రతి ఉద్యోగి అంకితాభావంతో పని చేసినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందని ఎస్‌ఐ మధురామచంద్రుడు అన్నారు. గుర్రంకొండ పోలీస్ స్టేషన్‌లో బదిలీపై వెళ్లిన సిబ్బందిని ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

మదనపల్లె టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల వద్దకు వచ్చే పలు సమస్యలను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్దకు నియోజకవర్గంలో నుంచి పలువురు తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రభుత్వశాఖల అధికారులతో ఎమ్మెల్యే ఫోన్ చేసి ప్రజా సమస్యలను విచారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరత

● వేరుశనగ గడ్డి ట్రాక్టర్ లోడ్

రూ.25 వేలు.. వరి గడ్డి రూ.18వేలు

పెద్దమండ్యం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) మండలంలో పశుగ్రాసం కొరత నెలకొంది. దీంతో పశుపోషణకు ఇబ్బందులు పడుతున్న రైతులు దూర ప్రాంతాల నుండి పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం మండలంలోని రైతులు కడప జిల్లా వేంపల్లి మండలంలో ట్రాక్టర్ వేరుశనగ గడ్డిని రూ.25 వేలతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరికొందరు రైతులు ప్రొద్దుటూరు, రాజంపేట తదితర దూరప్రాంతాల నుండి పశుగ్రాసం కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ట్రాక్టర్ వరి గడ్డి రూ.18 వేల వరకు పలుకుతోందన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని సబ్సిడీతో పశుగ్రాసం సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.



మదనపల్లెలోని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, తదితరులు





స్వాతంత్ర్య సమరయోధులు.. యువతకు ఆదర్శం

● ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



వాల్మీకిపురంలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మదనపల్లె టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్‌వారితో ఎదురొడ్డి పోరాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏపీఎస్ జేఏసీ నాయకుడు ఉత్తన్న పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రైవేటు కళాశాలలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. భారత ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారంటే దానికి ఎందరో వీరుల త్యాగఫలితమేనన్నారు. బాస్ అధ్యక్షుడు శ్రీచందు, న్యాయవాది సోమశేఖర్, వార్డెన్ రామ్‌ప్రసాద్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు గంగరాజు, మనోహర్, లారా పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

మదనపల్లె అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం, సీఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి హరినాథ్ శర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ నేటి విద్యార్థి, యువతకు భగత్‌సింగ్ పోరాట జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. చిన్నతనం నుంచే పోరాట పటిమతో దేశానికి సంపూర్ణ స్వతంత్ర్యం కోసం తన ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రిద్, జయబాబు, అఖిల్, హనుమంతునాయక్, ప్రసాద్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకిపురం ఉర్దూ మైనార్టీ బాలికల పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవమల్లిక, ఉపాధ్యాయులు సోఫియాబేగం, నర్మద, విద్యార్థులు పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఆదివారం సీపీఐ, ఏఐఎఫ్ నాయకులు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప, నియోజకవర్గ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కార్యదర్శి రమేష్ బాబు, ఏఐఎఫ్ నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం నారమాకులమిట్ట గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వారి చిత్రపటాలను ఆవిష్కరించి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ మాట్లాడుతూ కేవలం 23 ఏళ్ల వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యజించిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల జీవితాలు నేటి యువతరానికి ఆదర్శప్రాయమన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): యవ్వనంలోనే ప్రాణాలను పణంగాపెట్టి దేశంకోసం ఉరికంభం ఎక్కిన భగత్‌సింగ్ ఆదర్శమని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కొనియాడారు. ఆదివారం స్థానిక జ్యోతిసర్కిల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగడాలు చేతపట్టి భగత్‌సింగ్ అమర్‌రహే, జోహార్ అమర వీరుడా.. అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, రఘునాథ్, అష్రఫ్‌అలీ, నక్కామహేష్, తంబయ్యశెట్టి, మంజునాథ్, నారాయణస్వామి, గంగులప్ప, సౌమిత్రమ్మ, హరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పీలేరు: నారమాకులమిట్టలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



బి.కొత్తకోట: కాగడాలు చేతపట్టి భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఇంటి జాగాను ఆక్రమించి దౌర్జన్యం

● టీడీపీకి ఓటు వేశారని కక్షసాధింపు చర్యలు ● పోలీసులకు ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 40ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఇంటి నివేశస్థలం మంజూరు చేసి పట్టాలను సైతం ఇచ్చింది. అప్పటి నుంచి తమ అనుభవంలో ఉన్నా కూడా గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీకి ఓటు వేయలేదని అనేక ఇబ్బందులకు గురి చేశారని కాట్నగల్లు గ్రామం ఊయాలవాండ్లపల్లెకు చెందిన ఇడగొట్టి లక్ష్మన్న, ఇడగొట్టి గోవిందు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, గంగరాజు తమకు భూమిని ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఇడగొట్టి లక్ష్మన్న భార్య శంకరమ్మ పేరుతో సర్వేనంబర్ 647లో, అలాగే సర్వేనంబర్ 650లో వెంకటలక్ష్మమ్మ పేరుతో ఇంటి పట్టాను మంజూరు చేయడంతో అక్కడ పూరి గుడిసెలను నిర్మించుకున్నామన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన గంగరాజు సర్వేనంబర్ 650లో ఉన్న పూరి గుడిసెను వైసీపీ నాయకుల అండదండలతో జేసీబీతో కూల్చేసి స్వాధీనం చేసుకున్నాడని, అదేవిధంగా శంకరమ్మ పేరుతో ఉన్న పాత ఇంటి చుట్టూ మోహన్‌రెడ్డి కంప వేసి దౌర్జన్యం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కేవలం తాము టీడీపీ సానుభూతిపరులుగా ఉన్నామనే ఉద్దేశంతోనే తమపై దౌర్జన్యం చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు, పోలీసులు క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేయాలని వారు కోరారు.




జాగాను ఆక్రమించుకుని రాళ్లు అడ్డంపెట్టిన దృశ్యం

వయోజన విద్యతోనే మహిళల జీవితాల్లో వెలుగులు

నిమ్మనపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వయోజన విద్యతోనే మహిళల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఏపీఎం మురళి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సంఘాల మహిళలకు ఉల్లాస్ ప్లానెట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 15పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసి 320మంది మహిళా సభ్యులకు ఉల్లాస్ పరీక్ష నిర్వహించామన్నారు. అదేవిధంగా మహిళాసంఘాల్లోని మహిళలందరూ చదువుకోవాలనే ఉద్దేశంతో రాత్రిపూట బడులు నిర్వహించినట్లు తెలిపారు. ఉల్లాస్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి బహుమతులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించినవారిని కఠినంగా శిక్షించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

వాల్మీకిపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా నల్లజెర్ల మండలంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవ మానించిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘ జిల్లా నాయకుడు శివయ్య పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురం పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నో చోట్ల అంబేడ్కర్ విగ్రహాల ధ్వంసం, అనేక రకాలుగా అవమానపరచడం లాంటి సంఘటనలు జరిగాయని, ఇకముందు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విగ్రహాల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు బీవీ రమణ, వెంకటస్వామి, గాంధీపేట రఘు, నాగార్జున, నవీన్‌కుమార్, మహేష్, నాని, వెంకటముని, కుప్పుస్వామి,రమణయ్య, సహదేవ, తారక, శ్యాం సుందర్, తదితరులు పాల్గొన్నారు.

అవమానించడం సరికాదు

కలికిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించేందుకు పూనకోవడం హేయమైన చర్య అని అంబేడ్కర్ యువజన సంఘం, ఎస్సీ ఎంప్లాయీస్ సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. గోదావరి జిల్లాలో జరిగిన ఈ సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఈ సంఘాల నాయకులు ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణను చేయడానికి నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణలో హేతుబద్ధత లేదని తప్పుబట్టారు. తిరుపతిలో జరగబోయే మాలల సింహగర్జన సభకు అడ్డంకులు కల్పించడంపై కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. సంఘాల నాయకులు శ్రీనివాసులు, డి.రవీంద్ర, ఎస్టీ రమణ, జి.జయరాం, రాజ్‌కుమార్, జి.వెంకట్రమణ, జి.గోపి, పి.వేణుగోపాల్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విష ద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్యా యత్నం

మదనపల్లె అర్బన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): కొట్టారనే మనస్తాపం చెందిన వ్యక్తి ఆదివారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం వేంపల్లె గ్రామం గుట్టకిందపల్లెకు చెందిన కృష్ణమూర్తికి కుమారుడు శంకర(50), కుమార్తె లక్ష్మీదేవి కలరు. కమ్మవీధికిలోని కొత్తపల్లె మాజీ సర్పంచ్ బోయపాటి గోపాల్‌రెడ్డి ఇంట్లో శంకర చెల్లెలు లక్ష్మీదేవి పని చేస్తుంది. లక్ష్మీదేవి ఆదివారం పనికి రాలేదని గోపాల్‌రెడ్డి ఫోన్‌లో మందలించాడు. తన బంధువుల ఆరోగ్యం సరిగా లేదని చెబుతుండగా అక్కడే ఉన్న శంకర్ ఫోన్ తీసుకుని చావుబంతుకుల్లో ఉన్నా పని రావాల్సిందేనా అని అడిగాడు. కోప్పడిన గోపాల్‌రెడ్డి శంకరను ఇంటికి పిలిపించి ఇద్దరు మహిళలు, మరో ఇద్దరు వ్యక్తులు వైర్లతో దాడి చేసి గాయపరచడంతో మనస్తాపం చెందిన శంకర విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సురేంద్ర (ఫైల్‌ఫోటో)

మదనపల్లె అర్బన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి చెప్పారు. పట్టణం లోని బుగ్గకాలువకు చెందిన సురేంద్ర (46) మామిడి, అల్లనేరేడు పండ్ల వ్యాపారం చేస్తుంటాడని, ఇతను తిరుపతి మండిలో డబ్బులు రావాల్సి ఉండగా ఈనెల 19న ఇంట్లో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి సురేం ద్ర తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించారు. ఆయన ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం సురేంద్ర భార్య భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బడికాయలపల్లెలో చోరీ

● బంగారు నగలు, 3.20లక్షల నగదు అపహరణ

బి.కొత్తకోట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడికాయలపల్లెలో ఆదివారం చోరీ జరిగింది. వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచి వుంచిన 3.20లక్షల నగదు, బంగారం అపహరించారని బాధితుడు గాలేటి సురేంద్ర వాపోయాడు. ఈ మేరకు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు వెంటనే స్పందించి దర్యాప్తు ప్రారంభించారు. మదనపల్లె నుంచి క్లూస్ టీంను రప్పించారు. చోరీ జరిగిన నివాసంలో వేలిముద్రలను సేకరించారు. దర్యాప్తు చేసి బాధితుడికి న్యాయం చేస్తామని సీఐ పేర్కొన్నారు.

సురభి కాలనీలో 95వేల నగదు అపహరణ

● 53 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి కూడా..

మదనపల్లె అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం సురభి కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు పడి ఆదివారం 53 గ్రాములు బంగారు నగలు, 100 గ్రాముల వెండి, 95వేల నగదు అపహరించారు. పోలీసుల కథనం మేరకు.. సురభికాలనీలోని ప్రైవేట్ వాహనాల డ్రైవర్ రామకృష్ణ పాలమందలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరకు శనివారం కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడారు. ఆదివారం ఇంటికి వచ్చిన రామకృష్ణ దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ సీఐ ఎరిసావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జయచంద్రారెడ్డి



రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ప్రభుత్వ కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి కందులను క్వింటా రూ.7550తో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధరకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీఎం త్యాగరాజు, సీఈవో హరినాథరెడ్డి, సూపర్‌వైజర్ బాలాజీ, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు భజంత్రి రామాంజులు, కురబలకోట మండల కన్వీనర్ వైసీ సురేంద్రయాదవ్, పెద్దమండ్యం మండల నేతలు విశ్వనాథరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు కట్టా హరినాథ్, సుబ్బినాయుడు, చెన్నకేశవులు, పాస్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి పెద్ద పీట

ములకలచెరువు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ బీసీ సాధికార సమితి పాలఏకరి రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ ఎండ్లపల్లెలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా టీడీపీ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దే సుధాకర్‌నాయుడు, రఘుపతినాయుడు, తంబళ్లపల్లె, మదనపల్లె, సత్యసాయి జిల్లా పుట్టపర్తి కమిటీ సభ్యులు పెద్దరెడ్డప్పనాయుడు, ఆంజనేయులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

● డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కొండయ్యనాయుడు ఆదివారం హెచ్చరికలు జారీ చేశారు. బెట్టింగుల పాత నేరస్థుల వివరాలను సేకరిస్తున్నామని, మదనపల్లె, చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లు, గుంపులుగా కూర్చుని సెల్ ద్వారా బెట్టింగ్‌లు వేస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. తమ కుటుంబంలో బిడ్డలు, భర్తలు క్రికెట్, ఇతర బెట్టింగ్‌లు ఆడుతుంటే వెంటనే ధైర్యంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నవారి సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, డయల్ 100,112, సెల్ 9440794738నంబర్లకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణను ఆపాలి



ఆర్టీసీ ప్రైవేట్‌కరణ ఆపాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నేతలు

మదనపల్లె అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రత్యక్ష, పరోక్ష ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకులు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంగా సీఐటీయూ అనుబంధ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రచురించిన బుక్‌లెట్, కరపత్రాలను ఆదివారం ఆర్టీసీ ప్రాంగణంలో విడుదల చేశారు. విద్యుత్ బస్సుల కొనుగోలు పేరుతో ప్రైవేట్ ఓనర్లకు పలు రాయితీలు ఇవ్వడాన్ని వారు ఖండించారు. దీని వలన ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, బస్సుల్లో హెచ్చు చార్జీల వలన సామాన్యులకు ఉపయోగపడే పరిస్థితి లేదన్నారు. రేపు ఢిల్లీలో నిర్వహిస్తున్న ఆర్టీసీ చలో పార్లమెంటు నిరసనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రీద్, జయబాబు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

నాయనబావిలో ఘనంగా గంగమ్మ జాతర



అమ్మవారికి దీలు మోస్తున్న మహిళలు

బి.కొత్తకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను సుందరంగా అలంకరించారు. జాతర సందర్భంగా జంతుబలులు ఇచ్చారు. నాయనబావి, కుమారపురం గ్రామాలలో గంగమ్మ దేవతకు దీలు, జ్యోతులు మోశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉద్యోగాలు, బతుకుదెరువు రీత్యా బయట ప్రాంతాలకు వెళ్లిన గ్రామస్థులు, బంధువులు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో పల్లెలు నూతనశోభను సంతరించుకున్నాయి.

అశ్లీల నృత్యాలను ప్రోత్సహించిన వారిపై కేసులు

కురబలకోట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో వెలసిన దండు మారెమ్మ జాతరలో అశ్లీల నృత్యాలను ప్రోత్సహించిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చాందినీ బండ్ల ఊరేగింపునకు మాత్రమే అనుమతులు ఇచ్చామని, అయితే నిర్వాహకులు ఇష్టానుసారంగా డాన్సులను నిర్వహించారని, దీనిపై తమకు సమాచారం రావడంతో అడ్డుకున్నామన్నారు. అలాగే ట్రాక్టర్, డీజే వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

చిరంజీవి అవ్యయ్‌ను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపల్లె బేపాస్‌రోడ్డులో ఉన్న ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం మార్పూరివారి మనవడి నామకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి అవ్యయ్, సాయి సంహిత, ప్రశాంత్‌కృష్ణతో పాటు టీడీపీ నియోజక వర్గ సమన్వయకర్త మార్పూరి సుధాకర్‌నాయుడుకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా శుభాకాం క్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, టీడీపీ నాయకులు రాటకొండ సాగర్‌రెడ్డి, జ్ఞానాంబిక కళాశాల రాటకొండ గురుప్రసాద్, బసినికొండ బాబురెడ్డి, మార్పూరి సుధాకర్‌నా యుడు, శ్రీలత, డాక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

